క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో సోమవారం నాగుల పంచమిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సంతపేట, కైలాసపురం, మురకంబట్టు, ప్రశాంత్‌నగర్ తదితర ప్రాంతాల్లోని నాగాలమ్మ ఆలయాల్లో అభిషేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలోని పుట్టకు ప్రత్యేక పూజలు చేసి గుడ్డు, పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

శ్మశాన దారి సమస్యను పరిష్కరించండి

చిత్తూరు రూరల్: శ్మశానానికి వెళ్లే దారి సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగరంలోని చవటపల్లి వాసులు కోరారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆ గ్రామస్తులు మాట్లాడారు. పొలాలకు, శ్మశానానికి వెళ్లేందుకు కొందరు దారికి అడ్డుపడుతున్నారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు విచారించి సమస్యను పరిష్కరించేలా చూడాలని కోటీశ్వరన్, రాజా, అరుణ్‌కుమార్, వెంకటప్రసాద్ తదితరులు కోరారు.

బోడిరెడ్డికండ్రిగలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

పూతలపట్టు: మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ బోడిరెడ్డికండ్రిగలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు స్థానికులు రోడ్డు సమస్యను తెలియజేశారు. స్పందించిన ఆయన సీసీ రోడ్డు మంజూరు చేయించారు. లోకేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కుమార్ పాల్గొన్నారు.

సరస్వతమ్మకు నివాళి

పూతలపట్టు: మండలంలోని బాటగంగమ్మ మిట్టూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి సతీమణి సరస్వతి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం సోమవారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు బాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆనందయ్య, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

భక్తి పారవశ్యాన్ని నింపిన త్యాగరాజ సంగీతోత్సవాలు



సంకీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళానిధి లాల్‌గుడి జీజేఆర్ క్రిష్ణన్

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో సోమవారం ప్రదర్శించిన సంగీత కచేరీలు ఆహూతుల్లో భక్తి పారవశ్యాన్ని నింపాయి. త్యాగరాజ మండపంలో త్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సోమవారానికి నాలుగో రోజుకు చేరాయి. సంగీత విద్వాంసుడు ఓఎస్ అరుణ్ బృందం సంగీత గానాలాపన వీనుల విందు చేసింది. వీరికి వయోలిన్‌పై వీవీ.శ్రీనివాసరావు, మృదంగంపై నైవేలి స్కంధ సుబ్రమణ్యం సహకరించారు. అనంతరం సంగీత కళానిధి లాల్ గుడి జీజేఆర్.క్రిష్ణన్ ఆలపించిన త్యాగరాజ సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఆయనకు వయోలిన్‌పై సంగీత కళానిధి విజయలక్ష్మి, మృదంగంపై అరవింద్ రంగనాథన్, కంజీర్‌పై ఆలత్తూర్ రాజగణేష్ సహకారం అందించారు. కళాబృందాలను నిర్వాహకులు మోహన్ సుందరం, కంచి రఘురామ్, ప్రభాకర్ సత్కరించారు.

కరెంటు షాక్‌తో పెయింటర్ మృతి



మృతి చెందిన రాజా

వి.కోట: కరెంటు షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని పాముగానిపల్లె పంచాయతీ బైసు కుప్పం గ్రామానికి చెందిన యువతిని నెల్లూరు జిల్లాకు చెందిన భరత్‌కుమార్ వివాహం చేసుకుని ఇక్కడే పెయింటర్‌గా స్థిరపడ్డాడు. గ్రామ సమీపంలోని వేణుగోపాలపురంలో నూతనంగా నిర్మించిన ఓ ఇంటికి పెయింటింగ్ చేయవలసి ఉండగా నెల్లూరుకు చెందిన రాజా అనే వ్యక్తిని వెంట పెట్టుకుని ఆ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం పెయింట్ వేస్తూ ఇంటికి దరిదాపుల్లోని త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు హుటాహుటిన వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు రాజా అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. భరతకుమార్‌కు చికిత్స చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీకే జనబలం

- పంచాయతీ, వార్డు ఎన్నికల్లో జగనన్నకే ప్రజా మద్దతు
- వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ముత్తుకూరు పదో వార్డు సభ్యుడు గుణశేఖర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నాయకులు

చిత్తూరు రూరల్: ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరింత జన బలం తోడైందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు లబ్ధిపొందారే తప్ప పేద ప్రజలకు మేలు జరగలేదన్నారు. పింఛన్లు, సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ఈ కారణంగా ఆ పార్టీ నాయకులు పల్లెల్లో ఓట్లు అడిగే పరిస్థితులు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పార్టీలకు అతీతంగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే సర్టిఫికెట్లు, పథకాలు పొందుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ఫలితంగా వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతు అమాంతం పెరిగిందన్నారు. గడప గడప కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లో తిరుగుతున్నామని చెప్పారు. సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో మెప్పు కోసం రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని విమర్శించారు. ఎన్ని కుట్ర రాజకీయాలు చేసినా వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధిక చోట్ల గెలిచిందన్నారు. కుప్పంలోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే ప్రజలు పట్టం కట్టారన్నారు. చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు గుణశేఖర్ 10 వార్డు సభ్యుడిగా ఏకగ్రీవమయ్యారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గుణశేఖర్‌ను సన్మానించారు. సమావేశంలో పార్టీ నాయకులు త్యాగరాజులు, సంపత్, బాబు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యాదమరిలో గడప గడపకు..

యాదమరి: మండల కేంద్రం యాదమరి పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

జొన్నగురకలలో 67 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

తవణంపల్లె: మండలంలోని జొన్నగురకలలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. తవణంపల్లె వైద్యాధికారి మోహన్‌వేలు 67 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 104 వాహనంలో గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, వేదవతి, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గణనాథుని సేవలో ప్రభుత్వ కార్యదర్శి



రామ్‌గోపాల్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఐఏఎస్ రామ్‌గోపాల్ దర్శించుకున్నారు. సోమవారం కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ రవి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పథకాలే గెలిపించాయి



కాశిరాల రెండో వార్డు సభ్యుడు రజనిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

యాదమరి: జగనన్న అందిస్తున్న నవరత్నాల పథకాలే వార్డు సభ్యుడిగా తనను గెలిపించాయని కాశిరాళ్ల 2వ వార్డులో గెలుపొందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఆర్కాడ్ రజని అన్నారు. సోమవారం అయన్ను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి సత్కరించారు. అనంతరం రజని మాట్లాడుతూ.. తమ వార్డులో 150 మంది ఓటర్లు ఉన్నారని.. ఇందులో ఎక్కువ మంది టీడీపీ సానుభూతిపరులని తెలిపారు. అయితే సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సంతృప్తి చెందిన గ్రామస్తులు వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

యాదమరి: మండల పరిధిలో కిశోర బాలికలకు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా గణాంకాల అధికారి జార్జ్ అన్నారు. సోమవారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సంతగేటు ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలే మైనర్ వివాహాలను నిలుపుదల చేయాలని కోరారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి తగిన సలహాలు, సూచనలు చేయాలన్నారు. వారికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భూహక్కు పత్రాల పంపిణీ



భూహక్కు పత్రాలు అందుకుంటున్న రైతులు

పూతలపట్టు: మండలంలోని వేనూతనపల్లి పంచాయతీలో ఉన్న రైతులకు సోమవారం వైఎస్సార్-జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళించి, రైతులకు సంపూర్ణ భూహక్కు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూహక్కు-భూరక్ష రీసర్వేను చేపట్టిందన్నారు. తద్వారా భూ అక్రమాలకు పాల్పడినా, భూ తగాదాలు ఉన్నా న్యాయపరంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వేనూతనపల్లిలో 197 మంది రైతులకు భూ హక్కుపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ మునికృష్ణా, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, బాబు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగరంలోని 47వ వార్డు హౌసింగ్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వార్డు ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ గణేష్, కార్పొరేటర్లు జ్ఞానజగదీశ్, చల్లముత్తు, రెడ్డెప్ప, కోఆప్షన్ మెంబర్ కోలా కిరణ్ పాల్గొన్నారు.

నేడు 47వ డివిజన్‌లో..

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని 47వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాయినగర్ కాలనీ, పీఎస్సీ మున్సిపల్ స్కూల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

8 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైం: ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చార్మినార్ లాడ్జిలో 8 మంది పేకాటరాయుళ్లను ఎస్‌ఐ నాగేంద్రబాబు సోమవారం అరెస్ట్ చేశారు. తిరుపతిలో నివాసం ఉంటున్న శివనాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్ రెడ్డి, అభిరెడ్డి, మునిరెడ్డి, వెంగన్న మునిరెడ్డి, దేవేందర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా రూ.52,500 నగదు స్వాధీనం చేసుకుని ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. లాడ్జ్ యజమానిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ గోపీనాథ్, ఎస్వీబీసీ మాజీ సీఈవో శర్మ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

ధ్యానం ద్వారా ముక్తి ప్రసాదం





హాజరైన ధ్యానులు, ప్రసంగిస్తున్న పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి

తవణంపల్లె: ధ్యానం ముక్తి ప్రసాదిస్తుందని ప్రొద్దుటూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ మహా శక్తి క్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి పత్రిజీ 18 ఆదర్శ సూత్రాల గురించి వివరించారు. ధ్యానం ద్వారా జ్ఞానం.. జ్ఞానం ద్వారా ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. గోపాలక్రిష్ణమూర్తి, రాధిక పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న హాస్యనటుడు గౌతమ్‌రాజు



గౌతమ్‌రాజుకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మను సోమవారం ప్రముఖ సినీ హాస్యనటుడు గౌతమ్‌రాజు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. సినీ హాస్యనటుడు గౌతమ్‌రాజుతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: మండల పరిధిలో సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని.. ముఖ్యంగా విద్యుత్ సమస్యలను పట్టించుకోకుంటే ఎలా అని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం యాదమరి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సురేష్‌బాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ హనుమంతు మాట్లాడుతూ.. మండల పరిధిలో భూములను రీ సర్వే చేస్తున్నామని, పూర్తయిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై బుడితరెడ్డి పల్లె సర్పంచ్ వాసురెడ్డి మాట్లాడుతూ.. అధికారులు రీసర్వేను సక్రమంగా నిర్వహించడంలేదన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తహసీల్దార్ స్పందిస్తూ ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని.. మరోసారి సర్వే చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ గురప్ప మాట్లాడుతూ.. మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.కోటి ఖర్చు చేసి నూతనంగా ముద్దురామాపురం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే పెరియంబాడి వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం గుర్తించామని.. త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. అంతలోనే బుడితరెడ్డిపల్లె, తెల్లరాళ్లపల్లె, 184 గొల్లపల్లె, మోర్థానపల్లె, యాదమరి సర్పంచ్‌లు స్పందిస్తూ.. పంచాయతీ పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులు అందుబాటులో ఉండరని, ఎవరికి ఫోన్ చేసినా స్పందించరని వాపోయారు. బుడితరెడ్డిపల్లెలో వీధిలైట్లు ఏర్పాటుకు లైన్లు వేయాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. పలు పంచాయతీల్లో విద్యుత్ లైన్లు సక్రమంగా లేవని.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ శాఖ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని హితవుపలికారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ.. అంతర్ రాష్ట్ర రహదారిని రూ.50 లక్షలతో మరమ్మతులు చేస్తున్నారని, త్వరలో రూ.4 కోట్లతో తారురోడ్డు వేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమలు దూరం



యాదమరిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

యాదమరి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు బెడద నుంచి బయటపడవచ్చని సంతగేటు వైద్యాధికారి సురేఖ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమల వల్ల ఎన్నో ప్రాణాంతకమైన జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



బోడిపాటివారిపల్లెలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీ శివకుమార్

రొంపిచెర్ల: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని పుంగనూరు డివిజన్ ఏడీ శివకుమార్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని బోడిపాటివారి పల్లె గ్రామ పంచాయతీలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ-క్రాప్ నమోదు వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రకృతి విపత్తుల వలన పంటలు నష్టపోతే పరిహారం, పంట రాయితీ పొందవచ్చని, అలాగే సున్నా వడ్డీ, సబ్సిడీ పరికరాలు, ఎరువులు, పురుగు మందులను ఇస్తామని, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలకు అర్హత కూడా ఉంటుందన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధారాణి, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: ప్రతి రైతూ పండించిన పంటలను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలని పుంగనూరు వ్యవసాయ శాఖ ఏడీ శివకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నెల్లిమంద, వల్లిగట్ల, కందూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు.

నాడు-నేడు పనుల పరిశీలన



సదుం : స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూలులో నాడు-నేడు పనులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సోమవారం తనిఖీ చేశారు. గతంలో 21 తరగతి గదులు మంజూరు కాగా, 14 గదులు స్లాబ్ స్థాయిని దాటిందని సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. మరో 7 గదుల నిర్మాణానికి, ప్రహరీ మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అంతకుముందు బీసీ గురుకుల కళాశాల్లో ఈ సంవత్సరం నుంచి ప్రారంభమైన జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మాణానికి ఆయన స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సోషియల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డీడీలు రాజ్యలక్ష్మి, రబ్బాని బాషా, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, పుట్రాజు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల నిర్మాణ పనులు..

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ కుదవగడ్డ గ్రామంలో మురుగు కాలువల నిర్మాణ పనులను ఎంపీపీ యువరాజు సోమవారం పరిశీలించారు. త్వరిగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.